## కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ శాసనసభ విప్



**కుత్బుల్లాపూర్:** బీఆర్‌ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ బుధవారం మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపి పార్టీ పటిష్టతకు పని చేయాలని సూచించారు.

## దేవాదాయ శాఖలోకి సూరారం కట్ట మైసమ్మ ఆలయం



హుండీలకు సీల్ వేస్తున్న దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు

**సుభాష్‌నగర్:** సూరారంలోని కట్ట మైసమ్మ ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకుంది. దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ శేఖర్ నేతృత్వంలో బుధవారం అధికారులతో కలిసి డిప్యుటేషన్ స్టాంప్ ద్వారా దేవాలయంలో గల హుండీలకు సీల్ వేశారు. ప్రస్తుతం మూడు రోజుల పాటు జరుగనున్న అమ్మవారి జాతర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు. ఆలయ కమిటీ ఈవోగా కృష్ణమాచార్యులను నియమించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 9న వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

**జగద్గిరిగుట్ట:** మైసమ్మ నగర్ బి బ్లాక్, సృజనా వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 464 ఓట్లు ఉన్న ఈ కాలనీలో గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. బ్యాలెట్ ద్వారా నిర్వహించే ఈ ఎన్నికలు ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.

## ముగిసిన బ్రహ్మోత్సవాలు



**జగద్గిరిగుట్ట:** జగద్గిరిగుట్ట కొండపై ఉన్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి 54వ బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన ఈ ఉత్సవాలు 4 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. పూజలో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామివారి పల్లకీసేవ, గ్రామోత్సవం భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. బుధవారం స్వామి వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు ముగిసినా స్వామి వారి ఆశీస్సుల కోసం భక్తుల రద్దీ మాత్రం కొనసాగుతుంది.

## కాంగ్రెస్ మున్సిపల్ బీ బ్లాక్ మహిళా జనరల్ సెక్రటరీగా సాయిలీల

**నిజాంపేట్:** కాంగ్రెస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీ బ్లాక్ మహిళా జనరల్ సెక్రటరీగా గంధం సాయి లీలను నియమించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హన్మంత్‌రెడ్డిని కలిసి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం పని చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నిజాంపేట్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్‌రెడ్డి, నాయకులు అరవింద్, జీవన్‌రెడ్డి, రాజిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**దుండిగల్:** దుండిగల్-గండిమైసమ్మ రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. బుధవారం తహసీల్దార్ అబ్దుల్ మతిన్ ఆదేశాలతో దుండిగల్ మండలం సర్వే నంబర్ 214లోని ప్రభుత్వ భూమిలో వెలిసిన బేస్‌మెంట్లు, గదులను జేసీబీతో కూల్చివేయించారు. మరోసారి ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.



# కట్టమైసమ్మ జాతరకు వేళాయే

మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శని, ఆది, సోమవారాల్లో ప్రతి సంవత్సరం వేడుకలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రెండవ అతిపెద్ద జాతరగా సూరారం కట్టమైసమ్మ జాతర పేరొందింది. ఎన్నో ఏళ్లుగా మైసమ్మ అమ్మవారి జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ జాతర కొనసాగనుంది. మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శని, ఆది, సోమవారాల్లో ప్రతి సంవత్సరం జాతర జరుగుతోంది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

– సూరారం



కట్టమైసమ్మ ఆలయం

- 8 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

### ఆలయ చరిత్ర

నిజాం హయాంలో షేక్ అబ్దుల్ పాషా నవాబ్ సంస్థానంలో సూరారం గ్రామం భాగంగా ఉండేది. అప్పట్లో సూరారం గ్రామానికి చెరువును తవ్వించి కట్ట నిర్మించారు. పలుమార్లు ఆ కట్ట కూలిపోయింది. చెరువు పనుల్లో కూలిగా పని చేస్తున్న సూరయ్య అనే గ్రామస్తుడు నవాబు వద్దకు వెళ్లి.. కట్ట పదే పదే కూలిపోతోందని, అక్కడ కట్టమైసమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే బాగుంటుందని తెలిపాడు. దీంతో చెరువు కట్టను నిర్మించి దానిపై మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించగా కట్ట కూలిపోకుండా అలాగే నిలిచిందని పెద్దలు చెబుతుంటారు. అంతే కాకుండా అమ్మవారిని దర్శించుకుని కోర్కెలు కోరే భక్తుల అభీష్టాలను తీర్చే కల్పతరువుగా విరాజిల్లుతూ వచ్చింది. ఈ క్రమంలో 1999లో కట్ట మీదుగా వెళ్తున్న ఓ డీసీఎం అదుపు తప్పి అమ్మవారి గుడికి పక్కనే ఉన్న వేప చెట్టును ఢీకొట్టడంతో ఆలయం ధ్వంసమైంది. దీంతో ఆలయాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించిన గ్రామస్తులు 2002 ఆలయాన్ని పూర్తి చేసి అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శని, ఆది, సోమవారాల్లో అమ్మవారి ప్రత్యేక జాతరను నిర్వహిస్తున్నారు.

### ట్రాఫిక్ మళ్లింపు

కట్టమైసమ్మ జాతరను పురస్కరించుకుని సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రి నుంచి జ్యోతి మిల్క్ ఫ్యాక్టరీ వరకు వన్‌వే చేసినట్లు జీడిమెట్ల సీఐ శ్రీనివాస్ తెలిపారు. భారీ వాహనాలను సూరారం గ్రామం మీదుగా గండిమైసమ్మకు వెళ్లేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

### జాతర వివరాలు..

సూరారం చెరువు కట్టపై వెలిసిన కట్టమైసమ్మ, రేణుకా ఎల్లమ్మ అమ్మవార్ల జాతర వేడుకలు ఈ నెల 8న ప్రారంభం కానున్నాయి. నగరంతో పాటు మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, నల్గొండ, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. 8న జాతర మొదటి రోజు ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, పంచామృత స్నానంతో జాతర మొదలవుతుంది. ఉదయం 8 గంటలకు పుణ్యాహవాచనం, గణపతి పూజ, అంకురార్పణ, దీక్షాధారణ, నవవర్ణ జప హోమం, మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణం, తలంబ్రాలు, ఒడిబియ్యం సమర్పణ, సాయంత్రం 5 గంటలకు సూరారంలోని శ్రీరామాలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటుంది. 9న ఉదయం 5 గంటలకు ప్రత్యేక అలంకరణ, శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు, ఒడి బియ్యాలు, బోనాల సమర్పణ, మొక్కుల చెల్లింపులు, 10న రంగం, భవిష్యవాణి, పోతరాజుల విన్యాసాలు, ఫలహారబండి ఊరేగింపు, ఉంటాయి. 12న మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం కార్యక్రమంతో జాతర ముగుస్తుంది. భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాద్, బాలానగర్ చౌరస్తా, నర్సాపూర్‌ల నుంచి ప్రతి 15 నిమిషాలకు ఓ బస్సు ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ పేర్కొంది.

# 15 రోజుల్లో ప్లాస్టిక్ కవర్లు కనిపించొద్దు



వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

**కుత్బుల్లాపూర్:** 15 రోజుల్లో ప్లాస్టిక్ కవర్లు దుకాణాల కనిపించవద్దని, మార్పు రాకుంటే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. కొంపల్లి మార్కెట్‌లో పలు దుకాణాలను బుధవారం తనిఖీలు నిర్వహించి జరిమానా విధించారు. ఈ క్రమంలో కొంపల్లి మార్కెట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, బాలరాజ్, బి రమేష్ ఆధ్వర్యంలో పలువురు వ్యాపారులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. నెలరోజులు గడువు ఇచ్చిన తర్వాత తనిఖీలు చేపట్టాలని, గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్లు వీటి విషయంలో పెద్దగా ఆసక్తి చూపలేదని తెలిపారు. దీంతో తమకు అవగాహన లేదని చెప్పారు. నెలరోజులు కుదరదని 15 రోజుల్లో పద్ధతి మార్చుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న యోగా టీం సభ్యులు

**నిజాంపేట్:** ప్రతి రోజు యోగా చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని రిటైర్డ్ జడ్జి జనార్ధన్ అన్నారు. నిజాంపేట్‌లోని గోకరాజు రంగరాజు కాలేజీ క్యాంపస్‌లో రథసప్తమి సందర్భంగా శిక్షణా తరగతులు నిర్వహించారు. అందులో భాగంగా 108 సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమకు ఉన్న సమయంలో యోగా, ఇతర వ్యాయామాలు చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పతాంజలి యోగా టీం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

**నిజాంపేట్:** కార్పొరేట్ స్కూల్ కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని కాపాడాలని బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్ రాజు కోరారు. రెవెన్యూ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. బాచుపల్లిలోని వికాస్ స్కూల్ పక్కనే ఉన్న సుమారు 1.5 ఎకరం ప్రభుత్వ భూమిని ఆక్రమించారని తహసీల్దార్ పూల్‌సింగ్‌కు వివరించారు. కార్యక్రమంలో ఉదయ్, కిరణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

# ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**జీడిమెట్ల:** రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు వల్ల పేదలకు, చిరు ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం 130 డివిజన్ బీజేపీ అధ్యక్షులు విజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఎం.ఎస్.వాసు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కంది శ్రీరాములు, ఉషాకల్యాణి, ధనుంజయ్, గిరిబాబు, సౌరబ్‌సింగ్, మురళీధర్‌రెడ్డి, బబ్లూ, నరసింహ, సిద్ధిరాములు, రమేష్, శరత్, చందు, రఘు పాల్గొన్నారు.



క్షీరాభిషేకంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

**బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ..**

**చింతల్:** కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజల బడ్జెట్ అని బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పత్తి సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం చింతల్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్‌చారి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి బడ్జెట్‌లో కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రజిత, హేమలత, శ్రీనివాస్, నరేష్, సతీష్, యాదిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# వరద నీరు నిల్వకుండా చర్యలు



బహదూర్‌పల్లిలో వర్షపునీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్

**దుండిగల్:** ప్రధాన రోడ్లపై వరదనీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ అన్నారు. బుధవారం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బహదూర్‌పల్లి టెక్ మహీంద్రా, గండిమైసమ్మ చౌరస్తా, సారేగూడెం బస్టాప్, గాగిల్లాపూర్‌లోని చైతన్య కాలనీ, భౌరంపేట్, మల్లంపేట్, దుండిగల్‌ల్లోని వర్షపునీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలం లోగా లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిల్వ ఉండకుండా వాటర్ డ్రెయిన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. కమిషనర్ వెంట ఇంజినీర్ సురేందర్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

**దుండిగల్:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కార్యాలయంలో బుధవారం కలిసి సమస్యలు వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మెట్కాన్ గూడా గాజులరామారంలో జరగబోయే మల్లికార్జునస్వామి జాతరలో పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

## 10 నుంచి వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

**కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, చైర్మన్ ఠాకూర్ రాజేందర్‌సింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10న ఉదయం 6.30 గంటలకు వాసుదేవ పుణ్యాహవాచనం, అంకురార్పణం, 11న ఉదయం 9 గంటలకు చతుస్థానార్చన, ధ్వజారోహణం, రాత్రి 6.30 గంటలకు దేవతాహ్వానం, గజవాహన అలంకారసేవ, 12న ఉదయం 9 గంటలకు హోమం బలిహరణం, మంగళ స్నానం, సాయంత్రం 6.30 గంటలకు హనుమత్ వాహనంపై స్వామి వారి ఊరేగింపు, రాత్రి 9 గంటలకు ఎదుర్కోలు, రాత్రి 10 గంటలకు తిరుకల్యాణోత్సవం, 13న ఉదయం 9 గంటలకు శ్రీసుదర్శన హోమం, బలిహరణం, రాత్రి 9 గంటలకు గరుడ వాహన సేవ, 14న రాత్రి 10 గంటలకు రథోత్సవం, 15న ఉదయం 10గంటలకు మహాపూర్ణాహుతి, శ్రీచక్ర స్నానం, రాత్రి 7 గంటలకు శ్రీపుష్పయాగం, ద్వాదశ ఆరాధన, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది.

## విద్యుత్ ఉండని ప్రాంతాలు

**కుత్బుల్లాపూర్:** విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి ఏఈ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ స్టీల్ సిటీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దూలపల్లి గ్రామం, చైనాటౌన్, న్యూ స్టీల్ సిటీ, 11కేవీ జయభేరి ఫీడర్ పరిధిలో కొంపల్లి, జయభేరి పార్కు, బ్యాంక్ కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

## పేకాడుతున్న 11 మంది అరెస్ట్

**కుత్బుల్లాపూర్:** పేకాట స్థావరంపై దాడి చేసి 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దేవరయంజాల్‌లోని సత్తిబాబు ఫాం హౌస్‌లో 11 మంది మంగళవారం సాయంత్రం పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పేకాట స్థావరంపై దాడి చేసి పేకాడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 1,79,310 నగదు, 11 ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి ప్రశాంతి నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ పురోహితులు ఎమ్మెల్యేను వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

## సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి

**కుత్బుల్లాపూర్:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ముందుంటానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్ వినతి మేరకు బుధవారం ఆయన కొంపల్లి మున్సిపల్ ఒకటవ వార్డులోని ఎల్‌జీ విస్టాస్, పృథ్వీ, అద్విక్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో పర్యటించారు. సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ లో మాట్లాడారు. సమస్యలను పరిష్కరిచాలని కోరారు. జెమ్మి దేవేందర్, గోపాల్ రెడ్డి, ఆదిరెడ్డి మోహన్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, పూర్ణచందర్‌రావు, ఉపేందర్ రెడ్డి, అంజి , కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నేతలు



**కుత్బుల్లాపూర్:** బీఆర్‌ఎస్ శాసన సభ విప్‌గా నియమితులైన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను బుధవారం వివిధ కాలనీలకు చెందిన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మురళీ యాదవ్, రవికాంత్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

- పక్కనున్న టీ టైం షాపులోకి మంటలు
- సుమారు రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం
- బయటకు పరుగులు తీసిన సిబ్బంది
- మంటలార్పిన ఫైరింజన్
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ



**మూసాపేట:** కైత్లాపూర్‌లోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. పక్కనున్న టీ టైం షాపులోకి కూడా మంటలు వ్యాపించాయి. ఈ ఘటన బుధవారం జరిగింది. కూకట్‌పల్లి ఫైర్ స్టేషన్ అధికారి జగన్మోహన్ వివరాల ప్రకారం... కైత్లాపూర్‌లోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో అన్నం వండే క్రమంలో రెగ్యులేటర్ ఆన్ చేసేటప్పుడు గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. చిన్న షెడ్డు కావడంతో ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌తో పాటు టీ టైం షాపులోకి మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బయటకు రావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని అంచనా వస్తున్నారు. రెండు కమర్షియల్ ఫ్రిజ్‌లు, రెండు సాధారణ ఫ్రిజ్‌లు, టీ మేకింగ్ మెటీరియల్, ఫర్నిచర్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లోని ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. కూకట్‌పల్లి అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ ముత్తు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్




నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ :** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై నియోజకవర్గ పరిధిలోని షాపూర్ నగర్ రైతు బజార్ నుంచి ఉషోదయ టవర్స్ వరకు గుంజ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, టీయూసీఐ, ఐఫ్‌టీయూ నాయకులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ పాల్గొని మద్దతు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి చాలా అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో గూడ ఐలయ్య గౌడ్, సీపీఎం నాయకుడు లక్ష్మణ్, సీపీఐ నాయకుడు ఉపమహేశ్వర్ రావు, క్రిష్ణగౌడ్, ఆంజనేయులు, సతీష్ బాబు, నాగరాజు, జ్యోతి, లలిత, అచ్చమ్మ పాల్గొన్నారు.

**నిరసన ర్యాలీ**

**జగద్గిరిగుట్ట:** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడంలో కార్మిక రంగాన్ని విస్మరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు ఏసు రత్నం, మున్సిపల్ జిల్లా అధ్యక్షులు హరినాధరావు అన్నారు. జగద్గిరిగుట్ట చివరి బస్టాండ్‌లో బధవారం నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో చల్లపల్లి రాములు, సాయిలు, బాబు, రాములు, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

**లేబర్ చట్టాలను రద్దు చేయాలి**

**సుభాష్‌నగర్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక లేబర్ చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం కొంపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, సత్యనారాయణ, మౌలానా, అశోక్, లింగస్వామి, సత్యం, కిషోర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ : సీఐటీయూ**

**నిజాంపేట్:** కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్లకు అధిక ప్రాధాన్యత కల్పించి పేదలు, కార్మికులను విస్మరించారని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై, బడ్జెట్‌లో పేదలను విస్మరించడాన్ని నిరసిస్తూ బుధవారం బాచుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి నిధులు తగ్గించి కార్పొరేట్ శక్తులు దోచుకునే దానికి అవకాశాలు కల్పించారని విమర్శించారు. కార్యక్రమంలో జమీల్, వెంకటేశ్, భాస్కర్, రమేష్, యాదయ్య, రాములు, సువర్ణ, లక్ష్మి, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు



కొంపల్లిలో నిరసన ర్యాలీలో సీఐటీయూ..



నిరసన తెలుపుతున్న నాయకులు